క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



రాయపర్తి : పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సత్యవతి తెలిపారు. మండలంలోని బందనపల్లి, జగన్నాథపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పోషణమాసం కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మహిళలు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

నెక్కొండ : వివిధ కులాల కార్పొరేషన్ల ఏర్పాటు నేపథ్యంలో సీఎం కేసీఆర్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీకి ఆర్యవైశ్య, యాదవ సంఘాల నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు దేసు లక్ష్మణ్, దొడ్డ విజయ్‌కుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తాళ్ళూరి నర్సింహస్వామి, గోరంట్ల వెంకట్ నారాయణ, నంగునూరి కృష్ణమూర్తి, చిదురాల రాజు, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి..

రాయపర్తి : రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటును హర్షిస్తూ మండలంలోని మైలారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రెడ్డి సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పైడిపల్లి భీమారెడ్డి, నాయకులు ఈదులకంటి మహేందర్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, ఐరెడ్డి ఎల్లారెడ్డి, మాధవరెడ్డి, లక్ష్మారెడ్డి, మైబు, పరుపాటి రాజిరెడ్డి, పరుపాటి యాకూబ్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, తుమ్మ భూపాల్‌రెడ్డి, బొమ్మినేని రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'డ్రంక్ అండ్ డ్రైవ్'లో నలుగురికి శిక్ష

నెక్కొండ : ఈనెల 12న మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు చిక్కిన మండలానికి చెందిన వెంకన్న, అశోక్, రవి, రవీందర్‌లను నర్సంపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు శిక్ష విధించారని ఎస్సై మహేందర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా మద్యం సేవించి వాహనం నడుపుతూ నలుగురూ చిక్కారని చెప్పారు. వారిని కోర్టులో హాజరు పర్చగా అశోక్, రవి, రవీందర్‌లకు న్యాయమూర్తి రూ.3700 జరిమానా, వెంకన్నకు రెండ్రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని స్పష్టం చేశారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్టు

సంగెం : పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. మండలంలోని గవిచర్లలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా విచారణ కోసం వెళ్లిన తనను గ్రామానికి చెందిన దొనికెల శ్రీనివాస్ అడ్డుకుని దూషించినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను బుధవారం అరెస్టు చేసి జ్యూడీషియల్ విచారణకు పంపించినట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో దున్నపోతు మృతి

చెన్నారావుపేట : విద్యుదాఘాతానికి గురై దున్నపోతు మృతి చెందిన ఘటన మండలంలోని పాపయ్యపేటలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రామగోని రవి అతడి పశువులను గ్రామ శివారులోని వాగు వద్దకు తీసుకెళ్లిన క్రమంలో తెగిపోయిన 11 కేవీ విద్యుత్ తీగ దున్నపోతుపై పడింది. దీంతో దున్నపోతు అక్కడికక్కడే మృతి చెందింది. దున్నపోతు విలువ సుమారు రూ.20 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

వాగు వెంట విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామస్తులు మీడియాకు తెలిపారు. మరిన్ని విద్యుత్ తీగలు కూడా తెగిపడే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించి ప్రాణనష్టం కలుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మొల్లమాంబ జయంతి

వర్ధన్నపేట : కుమ్మర సంఘం మండల అధ్యక్షుడు బొడ్డుపెల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండలంలోని ఇల్లందలో మొల్లమాంబ జయంతి వేడుక బుధవారం నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడారు. మొల్లమాంబ సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన గొప్ప కవయిత్రి అని కీర్తించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట : అర్హులందరికీ దశల వారీగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. పట్టణంలోని 23వ వార్డు పరిధిలోని రాజీవ్‌నగర్‌లో బుధవారం ఎర్ర కల్పన–సురేశ్ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తోందని తెలిపారు. అలాగే 8 మంది దివ్యాంగులకు ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీం కింద ఆర్థిక సాయం చెక్కులు, రెండు ఫోన్లు అందించారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సీడీపీఓ ఎ.రాధిక, ఏసీడీపీఓ శ్రీదేవి, యూడీసీ అలీ, ఎల్‌డీసీ రమ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సాంబరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, కౌన్సిలర్ ఓర్సు అంజలి, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలోని నందమూరినగర్‌లో దంతాల భాగ్య–శ్యాం దంపతుల స్థలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మాధవరెడ్డి శంకుస్థాపన చేశారు. టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నర్సంపేట అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో టీకుల గంగమ్మకు చెందిన స్థలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, నాయకులు తాళ్లపల్లి నర్సయ్య, మొగిలి వెంకట్‌రెడ్డి, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలో బి.రాజు ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాబు, ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఆర్థిక పురోగతిలో మహిళలు కీలకం



నర్సంపేట : కుటుంబాలు ఆర్థిక పురోగతి సాధించడంలో మహిళలు కీలకమని మహిళా సమన్వయ సమితి అధ్యక్షురాలు చిలువేరు రజని భారతి స్పష్టం చేశారు. పట్టణంలోని వినియోగదారుల కార్యాలయంలో మహిళా సంఘాలు, వినియోగదారుల సంఘాల, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిశ, పోక్సో లాంటి ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా మహిళలకు రక్షణ ఉండడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. చట్టాలు, టోల్ ఫ్రీ నంబర్లు 181, 1098, 1930 గురించి అవగాహన పెంచుకుని ఆపద సమయాల్లో వాటిని వినియోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి మాట్లాడుతూ మహిళల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతోందన్నారు. అనంతరం ఆర్టీఓ కాసుల కృష్ణవేణి, రెజీనా చిన్నప్ప, రాష్ట్ర మహిళా వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షురాలు మైస వసంతకు అవార్డు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల క్యాట్కో ఉపాధ్యక్షుడు డాక్టర్ ఠాకూర్ రతన్‌సింగ్, ఓరుగల్లు వినియోగదారుల కౌన్సిల్ అధ్యక్షుడు యుగంధర్, డీసీఐసీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

నల్లబెల్లి : విద్యాశాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్టీయూ పోరాడుతోందని రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో స్పెషల్ ఆఫీసర్ సునీత అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశానికి శ్రీపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేజీబీవీ ఉద్యోగులకు రానున్న ఆర్థిక సంవత్సర ప్రారంభంలో మినిమం టైం స్కేల్ అందేలా, ఇతర సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో సంఘం వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు ఈదునూరి రవీందర్‌రెడ్డి, మండల తిరుపతిరెడ్డి, కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జాలి రాఘవరెడ్డి, మండల అధ్యక్షుడు నకిరెడ్డి మహేందర్, ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పోలోజు భిక్షపతి, నాయకులు శ్రీధర్ బాబు, జక్కుల సుభాష్, నాగరాజు, బానోత్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

విద్యార్థి ఎదుగుదలలో 'టెన్త్' తొలిమెట్టు



సంగెం : కాపులకనిపర్తిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



పర్వతగిరి : ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

చెన్నారావుపేట : విద్యార్థి ఎదుగుదలలో పదో తరగతి తొలిమెట్టని ఉప్పరపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయ తెలిపారు. మండలంలోని ఆ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడారు. విద్యార్థులు 10 జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోశ్ కుమార్, పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మాధవి, వేముల మమత, తదతరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో హెచ్‌ఎం రంగారావు మాట్లాడారు. విద్యార్థి దశలో పదో తరగతి కీలకమన్నారు. భయం వీడి పరీక్షలు బాగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇక్బాల్, విశ్వప్రసాద్, రమేశ్, శ్రీదేవి, రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని కాపులకనపర్తి హైస్కూల్‌లో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో హెచ్‌ఎం శోభారాణి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి తల్లితండ్రుల, పాఠశాల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల, రాజన్న, పద్మజ, వెంకట్, స్వప్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

లోహితలో...

లోహిత గ్రామంలోని హైస్కూల్‌లో నిర్వహించిన వీడ్కోలు సందర్భంగా 20 మంది పదో తరగతి విద్యార్థులకు ఎంపీటీసీ అడ్డగట్ల దుర్గారావు పరీక్షల కిట్స్ అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.5 వేల బహుమానం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజివర్ధన్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ ల్యాదల్ల యాదగిరి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్ ఆర్డీఎఫ్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లలను ఆశీర్వదించి హాల్ టికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బాషబోయిన రాములు మాట్లాడారు. పదో తరగతి విద్యార్థి తండ్రి నరేందర్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయులు ఇ.రమేశ్, జె.బాలరాజు, పదో తరగతి ఇన్‌చార్జ్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై పాలకుల నిర్లక్ష్యంతో వలసలు

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గ్రామీణ ప్రాంత కూలీలు పట్టణాలకు వలస పోతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య తెలిపారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో సమ్మయ్య మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కోత విధిస్తోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలువురి జాబ్ కార్డులను తొలగించాయని తెలిపారు. ఉపాధి పనులను గ్రామాల్లో విస్తృతపర్చి వ్యవసాయ కార్మికులకు పని భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం ఉపాధి హామీ పనుల పట్ల నిర్లక్ష్యంతో ఉందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గౌతం, చేరాలు, మొగిళి, పసునూరి సుజాత, నర్సక్క, రవీందర్, మల్లేశ్, నర్సయ్య పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మెగా హెల్త్ క్యాంపు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవ పథకం, మహిళా సాధికారత సెల్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ డయాగ్నోస్టిక్స్ హబ్ సౌజన్యంతో బాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బుధవారం మెగా హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ మాట్లాడారు. కమ్యూనిటీ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా హెల్త్ క్యాంపు నిర్వహించినట్టు తెలిపారు. సుమారు 100 మందికిపైగా పట్టణవాసులు, విద్యార్థులు, సిబ్బంది రక్త పరీక్షలు చేయించుకున్నారని చెప్పారు. నేడు (గురువారం) కూడా క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐ.శివనాగ శ్రీను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.రమేశ్, మహిళా సాధికారత సెల్ కన్వీనర్ డాక్టర్ టి.సుమతి, సభ్యులు డాక్టర్ జి.ప్రసూన, ఎం.శైలజ, ఏ.పావని, తోట రమేశ్, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ లకన్‌సింగ్, ఎం.నరేందర్, డాక్టర్ వి.పూర్ణచందర్, ఎం.సమ్మయ్య, డాక్టర్ ఆర్.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సైడ్‌కాల్వ నిర్మాణ పనులు ప్రారంభం



సంగెం : సైడ్‌కాల్వ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ



గీసుకొండ : పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

సంగెం : మండలంలోని కుంటపల్లిలో రూ.3.60 లక్షల వ్యయంతో చేపట్టిన సైడ్‌కాల్వ నిర్మాణ పనులను ఎంపీపీ కళావతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండల ప్రజాపరిషత్ నిధులు కేటాయించగా పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కావటి వెంకటయ్య, ఎలుగోయ లింగయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ జున్న కొమురుమల్లు, పంచాయతీ కార్యదర్శి వాజీద్, నాయకులు పెంతల ప్రతాప్, కాగితాల జగన్నాథచారి, జున్న రాజమల్లు, దానం స్వామి పాల్గొన్నారు.

ఐటీడీఏ నిధులతో..

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురంలో ఐటీడీఏ నుంచి కేటాయించిన రూ. 20 లక్షలతో డ్రైనేజీ, అంగన్‌వాడీ కేంద్ర మరమ్మతు పనులకు ఎంపీపీ బీమగాని సౌజన్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ సహాయక ఇంజనీర్ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు చాడ కొమురారెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు రుద్రప్రసాద్, నాయకులు కూసం రమేశ్, నాగారం స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

వర్ధన్నపేట : వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ కోరారు. పట్టణంలోని వరంగల్–ఖమ్మం ప్రధాన రహదారిపై బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటేనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని చెప్పారు. కార్లు నడిపే వ్యక్తులు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, నిర్ణీత వేగాన్ని మించొద్దని, మద్యం సేవించి వాహనాన్ని నడపొద్దని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంతోపాటు లైసెన్స్, ఇతర పత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సమకరించాలని కోరారు.



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం

నల్లబెల్లి : మండలంలోని మూడుచెక్కలపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడుగా పని చేసిన సువర్ణపాక జగ్గారావుకు పాఠశాల ఆవరణలో బుధవారం ఉద్యోగ విరమణ సన్మానం చేశారు. ఈ సందర్భంగా సభకు పీజీ హెచ్‌ఎం సాంబయ్య అధ్యక్షత వహించగా సావిత్రి–జగ్గారావు దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధుమిత్రులు శాలువాలు, పూలదండలతో సన్మానించి మెమోంటో బహుకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రాజు మాట్లాడారు. జగ్గారావు 34 ఏళ్ల ఉపాధ్యాయుడిగా సేవలు అందించారని అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందాడని చెప్పారు. అనంతరం చదువు ప్రాముఖ్యత, బాల్యవివాహాలతో కలిగే అనర్థలను వివరిస్తూ విద్యార్థినులు ప్రదర్శించిన నాటికలు చైతన్యం నింపాయి. కార్యక్రమంలో ఏసీఎంఓ శ్రీరాములు, పీజీ హెచ్‌ఎం గంగు, తదితరులు పాల్గొన్నారు.



జగ్గారావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

నల్లబెల్లి : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిషత్ ఉంటుందని రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సారంగపాణి తెలిపారు. మండలంలోని మేడపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో రాణిస్తున్న 68 మంది మంది బాల, బాలికలకు ప్రశంస పత్రాలతోపాటు క్రీడా దుస్తులు అందజేశారు. విద్యార్థులను క్రీడల్లో పోత్సహిస్తున్న ఉపాధ్యాయులకు ట్రాక్ సూట్స్ అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జవహర్‌లాల్ నెహ్రూ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదుపుతో ఆర్థిక పురోగతి

సంగెం : ప్రతినెలా పొదుపు చేసుకోవడంతో ఆర్థిక పురోగతి సాధించవచ్చని జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గవిచర్లలో శ్రీరామలింగేశ్వరస్వామి పురుషుల పొదుపు సంఘం 27వ వార్షిక మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని రైతులు, రైతు కూలీలు సంపాదనలో కొంత పొదుపు చేసుకోవడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తద్వారా అనవరాలకు తక్కువ వడ్డీకి రుణం, బోనస్, అప్పు పొందడంతోపాటు వృద్ధాప్యంలో ఇతరులపై ఆధారపడకుండా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పొదుపు సంఘం అధ్యక్షుడు గుండబోయిన ఎల్లగౌడ్, పాలకవర్గం, సభ్యులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలో శ్రీకంఠ మహేశ్వరస్వామి, సురమాంబదేవి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మేడి రమాదేవి దేవేందర్‌గౌడ్ కుమారులు మేడి శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్ రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలకు గౌడ సంఘం పెద్దలు మేడి ప్రభాకర్‌గౌడ్, సంఘం అధ్యక్షుడు కత్తి స్వామిగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సమ్మయ్య, మేడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లకొండలో..

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం కరిమిళ్ల పద్మ–దుర్గారావు దంపతుల కుమారుడు అశ్విన్‌కుమార్–ఝాన్సీ దంపతులు రూ.50 వేల 116 విరాళం అందజేశారు.

బాధితుడికి ఐటీడీఏ సాయం

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావికి చెందిన రాయపురి నర్సయ్య ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోగా ఐటీడీఏ నుంచి రూ.25 వేల సాయం అందింది. ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ చిత్రా మిశ్రా ట్రైబల్ వెల్ఫేర్ రిలీఫ్ ఫండ్ కింద రూ.25 వేల తక్షణసాయం అందించాలని ఆదేశించగా అసిస్టెంట్ ఆఫీసర్ వసంతరావు బాధితుడు రాయపురి నర్సయ్యకు బుధవారం రూ.25 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రతినిధి రాజ్‌కుమార్, రాయపురి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరెపల్లిలో..

గీసుకొండ : మండలంలోని ఆరెపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గువాడి మోహన్‌రావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మనుగొండకు చెందిన ఆ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి బుధవారం ఆర్థికసాయం అందజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు మర్రెడ్డి, కందికొండ రాజ్‌కుమార్, తోట కమలాకర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



సంగెం : మండల కేంద్రంలోని విద్యాభారతి హైస్కూల్‌లో బుధవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతులు బోధించారు. ఆర్జేడీగా సామ్యూల్‌రాజ్, డీఈఓగా కలహంసి, ఎంఈఓగా సహస, ప్రిన్సిపాల్‌గా తరుణ్, వైస్‌ప్రిన్సిపాల్‌గా హిమబిందు, కరస్పాండెంట్‌గా సాయితేజ, ఉపాధ్యాయులుగా పలువురు వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్‌లు మినుముల రాజు, మైదంశెట్టి చందర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు మధు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.